# ఏకలవ్యుడు

ఆదెమ్మ పరిగెత్తుకుంటూ వచ్చింది.

"మాట్టారుగోరు! రాంబాబుని మా మావ తాగొచ్చి చితక బాదేత్తున్నాడు బాబూ! ఆడి జేబులో డబ్బులు కాజేసేడంట! ఎందుకని ఎంత అడిగినా సెప్పడంలేదు. మీ సేతి సలవవల్ల ఆడు బాగా సదూకొంత న్నాడు. మా కొంపల్లో పెతీ ఒక్కరికీ సంతకం రావాలని మీకాడ సదూకుని రాత్రేళ ఆ సదువు మాకు సెబుతున్నాడు ఆడు. మా కొంపలో మా మాట ఇననోడు మా మావొకడే. ఆడికి పగలల్లా కూలిపని కెల్లి మాపటేలకి తాగి తొంగోడమే సరిపోద్ది. ఈయాల తాగుడికి దాసుకున్న డబ్బులు 'రాంబాబు' దొంగతనం సేసాడని సంపేత్త న్నాడు బాబు! మీరే వొచ్చి కాపాడాల"

గుండెలు బాదుకుంటూ చెబుతున్న ఆమె మాటలు పూర్తవకుండానే పంచాక్షరం మాస్టారు ఫస్ట్ఎయిడ్ బాక్స్ తీసుకుని, పైన కండువా వేసుకొని, ఆదరాబాదరా బయల్దేరి, ఆదెమ్మ గుడిసె దగ్గరకు చేరుకున్నారు.

రాంబాబు సొమ్మసిల్లి పడిపోయి ఉన్నాడు.

అప్పుడే దూరంగా కల్లుపాకకేసి తూలుకుంటూ వెళ్తున్న రంగయ్య కనిపించాడు పంచాక్షరం మాస్టారికి.

రాంబాబుని రెండు చేతుల్తో ఎత్తు కొని అక్కడే వాల్చివున్న కుక్కి మంచంలో పడుకోబెట్టారాయన. ఒళ్ళంతా దెబ్బలు, చారలు తేలిపోయి కనిపిస్తున్నాయి. క్రింది పెదవి తెగి రక్తం కారుతోంది. అది చూస్తూనే ఆదెమ్మ సోకన్నాలు మొదలుపెట్టింది.

"ఓర్నాయనో! ఈడి సేతులిరిగిపోను! బిడ్డను సంపేశాడు దేవుడో! ఈడితాగుడు తగలెట్ట! ఈడి జిమ్మడిపోనూ! నేనేం సేతున్రో! ఈడిని ఎలా మార్చాలి రా దేవుడో! సదువు సెప్పేవోడ్ని గురువంటారే! ఈడ్నిట్టా కొట్టడానికి ఆడికి సేతులెట్టొచ్చినాయ్ నాయనో!" ఆమె కళ్ళమ్మట వస్తున్నవి కన్నీళ్లు కాదు! పేగులు కోసేస్తున్న మమకారం.

మౌనంగా వాడి గాయాలకు ఫస్ట్ ఎయిడ్ చేశారు పంచాక్షరం మాస్టారు. చల్లటి నీటితో గుడ్డతడిపి ముఖం మరోసారి తుడిచారు.

అయిదు నిమిషాలలో నెమ్మదిగా తెలివివచ్చింది రాంబాబుకి. మాస్టారిని చూస్తూనే లేచి కూర్చోబోయాడు. హూనమైన ఒళ్లు సహకరించలేదు. సూటిగా చూస్తున్న మాస్టారిముందు ముద్దాయిలా తలొంచుకుని చెప్పాడు.

"మాస్టారూ! డబ్బున్న పిల్లలందరూ మీకు స్కూల్లో మనస్ఫూర్తిగా దణ్ణం పెట్టుకొని గురుపూజ చేస్తుంటే మీకు నా చేతుల్తో ఒక్క 'పండు' ఇచ్చుకుని నమస్కరించుకుందామని అయ్య జేబులో డబ్బులు కాజేశాను మాస్టారూ. నన్ను క్షమించండి! క్షమిస్తారు కదూ?" రాంబాబు కళ్ళనుండి నీళ్లు ధారలుగా జారిపోతున్నాయి.

నిజమైన గురుభక్తి ప్రతిబింబిస్తున్న ఆ 'ఏకలవ్యుడ్ని' చూస్తూ చెమ్మగిల్లిన కళ్ళతో ఆప్యాయంగా వాడి తల నిమురుతూ వుండిపోయారు పంచాక్షరం మాస్టారు.

అంతులేని వాత్సల్యంతో ఆయన మనసు నిండిపోయింది ఆ క్షణంలో. ●

'ఆంధ్రభూమి సచిత్రవార పత్రిక' 21-02-1991